బోనాలకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు



చార్మినార్: బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అని సుల్తాన్ షాహి జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ రాకేశ్ తివారి అన్నారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహించామన్నారు. ఇందుకు సహకరించిన ఆలయ కమిటీ ప్రతినిధులతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులందరికీ కృతజ్ఞతలని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాకేశ్ తివారిని ఎం.సంతోష్, రమేష్, జ్యోతి తదితరులు సన్మానించారు.

కాంగ్రెస్‌కు ప్రజల్లో ఆదరణ



రాజేంద్రపాల్ గౌతమ్‌ను సన్మానిస్తున్న మిత్ర కృష్ణ

గోల్కొండ: కాంగ్రెస్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని కాంగ్రెస్ ఎస్సీ విభాగం జాతీయ చైర్మన్ రాజేంద్ర పాల్ గౌతమ్ అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు మిత్ర కృష్ణ సోమవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా వేసి పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా రాజేంద్రపాల్ గౌతమ్ మాట్లాడుతూ..దళితులు, మైనార్టీలు, గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ ఎంతగానో కృషి చేసిందన్నారు. భారత రాజ్యాంగంలో వారికి పొందుపరిచిన హక్కులను వందశాతం ప్రయోజనాలు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం దే అని ఆయన అన్నారు.

పాత పద్ధతిలోనే జీతాలను అందజేయాలి



సలావుద్దీన్ లోది

చార్మినార్: మసీదుల్లో పని చేసే మోజం, ఇమామ్‌లకు వెంటనే జీతాలు పెంచి నిబంధనలు సడలించాలని బీఆర్ఎస్ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహమ్మద్ సలావుద్దీన్ లోది డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం వక్ఫ్ బోర్డు సీఈఓకు రాతపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మోజంలకు రూ12,000 ఇమామ్లకు రూ.10వేల జీత భత్యాలను అందజేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే మూడు నెలలకోసారి ఆదాయం సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలని కోరడం సరైనది కాదన్నారు. పాత పద్ధతిలోనే వారికి జీతాలను అందజేయాలని ఆయన కోరారు.

పాతబస్తీలో షియా ముస్లిం చిన్నారుల వార్షిక రూలా ర్యాలీ

చార్మినార్: షహజాదా అలీ అస్గర్ 1386వ, బలిదానం వార్షికోత్సవానికి సంబంధించి సోమవారం పాతబస్తీలో రూలా షహదత్ ర్యాలీ జరిగింది. హజ్రత్ ఇమామ్ హుస్సేన్ (అ.స) చిన్న కుమారుడి త్యాగాన్ని గుర్తుచేసుకుంటూ ఈ ర్యాలీ జరిగింది. ర్యాలీలో పాల్గొన్న షియా ముస్లిం చిన్నారులు తమ ఎదపై బాదుకుంటూ రక్తాన్ని కిందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతో పాటు సయ్యద్ ఖర్రార్ హుస్సేన్ అబేది, సయ్యద్ అలీ హుస్సేన్ జైదీ తదితరులు పాల్గొన్నారు. ఖూనీ మాతంలో గాయాల గురైన చిన్నారులకు అప్పటికప్పుడే ప్రాథమిక చికిత్స అందించారు. మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ చిన్నారులను ఓదార్చారు.

'ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రజలను విస్మరించారు'



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: పదేళ్ల పాటు ప్రజలను విస్మరించిన ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ప్రజలు ఇక్క చుక్కలు చూపిస్తారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గోషామహల్ ప్రజల ఓట్లతో గెలిచిన రాజాసింగ్ పదేళ్లుగా ఇతర రాష్ట్రాల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యలను, ప్రజాభివృద్ధిని విస్మరించారన్నారు. సోమవారం ఆనంద్‌కుమార్ గౌడ్ తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ..మీడియా తనపై దుష్ప్రచారం చేస్తుందని ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. దమ్ముంటే ఎమ్మెల్యే రాజాసింగ్ వెంటనే రాజీనామా చేసి తిరిగి ఎన్నికల్లో పోటీ చేయాలన్నారు. గోషామహల్‌లో ఎమ్మెల్యే గెలిచిన తర్వాతనే రాజాసింగ్‌కు గుర్తింపు వచ్చిందన విషయాన్ని రాజాసింగ్ మరిచిపోవడం బాధాకరమన్నారు.

'ప్రజల కథే నా ఆత్మకథ' గ్రంథం అందజేత

నాంపల్లి: ప్రజల కథే నా ఆత్మకథ అనే గ్రంథాన్ని రచించిన హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తనకు పరిచయం వ్యక్తులను ఆహ్వానించి గ్రంథాలను అందజేస్తున్నారు. ఇందులో భాగంగానే టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పాశం రాజేందర్ యాదవ్‌కు అందజేశారు. ఈ గ్రంథాన్ని బండారు దత్తాత్రేయ నుంచి స్వీకరించడం సంతోషంగా ఉందని రాజేందర్ యాదవ్ పేర్కొన్నారు.



గుల్జార్‌హౌజ్-చార్‌కమాన్ రోడ్డులో ఫుట్‌పాత్‌తో పాటు నడి రోడ్డుపై కొనసాగుతున్న వ్యాపారాలు



ఫుట్‌పాత్‌లు లేకపోవడంతో వాహనాల నడుమ నుంచి ముందుకు వెళ్తున్న పాదచారులు, పర్యాటకులు

ఎన్నాళ్లిలా..?

- గుల్జార్‌హౌజ్ టు నయాపూల్ మధ్య కనిపించని ఫుట్‌పాత్‌లు
- నడిరోడ్డుపై వ్యాపారాలు
- ముందుకు సాగని వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

చార్మినార్: హైకోర్టు ఆదేశాలున్నప్పటికీ..పాతబస్తీలో ఫుట్‌పాత్‌లను అందుబాటులోకి తీసుకురావడం లేదు సంబంధిత అధికారులు. నగరంలోని ఇతర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు అందుబాటులో ఉన్నప్పటికీ..పాతబస్తీలో ఏళ్లు గడుస్తున్నా..కనిపించడం లేదు. ముఖ్యంగా పాతబస్తీలోని ప్రధాన రోడ్డైన గుల్జార్‌హౌజ్ నుంచి నయాపూల్ వరకు ఇంకా ఫుట్‌పాత్‌లు అందుబాటులోకి రావడం లేదు. ఈ రోడ్డులో రద్దీ సమయంలో కేవలం ఒక కిలోమీటర్ దూరానికి అర గంట సమయం పడుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలను అధికారులు పట్టించుకోకపోవడంతో దుకాణాలు(షో రూం)ల ముందున్న ఫుట్‌పాత్‌లు తమ సొంతమన్నట్లు ఆయా షో రూంల యజమానులు వ్యవహరిస్తున్నారు.

నడిరోడ్డు పైనే వాహనాల పార్కింగ్..

ఫుట్‌పాతులే కాదు..రోడ్లు సైతం ఆక్రమించుకొని నడిరోడ్డుపై వ్యాపారాలు కొనసాగుతుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. పండ్లు, గాజులు, దుస్తులు, నిత్యావసర సామగ్రి..ఒక్కటేమిటి పాతబస్తీలో సర్వం రోడ్లపైనే అమ్మకానికి ఉంటాయి. వాహనాల పార్కింగ్ కూడా నడిరోడ్డు పైనే!. ఫుట్‌పాత్‌లను పూర్తిగా ఆక్రమించడమే కాకుండా నడిరోడ్డుపై చిరువ్యాపారాలు కొనసాగుతున్నాయి. దీంతో పాదచారులు నడిరోడ్డుపై నడిచి వెళుతుండడంతో ఎప్పుడు ఏ వాహనం వెనుక నుంచి వచ్చి ఢీ కొడుతుందోననే భయాందోళనలో బిక్కుబిక్కుమంటూ ముందుకెళుతున్నారు.

సమన్వయంతో పని చేసి ఆక్రమణలను నియంత్రిస్తే ఆశించిన ఫలితాలు..

జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సమన్వయంతో పని చేస్తే ఆశించిన ఫలితాలుంటాయి. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఫుట్‌పాత్ కబ్జాలను తొలగించాలి. చార్మినార్-మదినా రోడ్డులో కొనసాగుతున్న ఫుట్‌పాత్ వ్యాపారాలు, ఆక్రమణల్ని నియంత్రించాలి. రోడ్లపైనే నిల్చుని అమ్మకాలు జరుపుతున్న వారిని కట్టడి చేయాలి. పాతబస్తీలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చోట సిబ్బంది సంఖ్యని పెంచాలి. పోలీస్, ట్రాఫిక్ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమన్వయంతో వ్యవహరించాలి. అవసరమైన చోట రోడ్ల విస్తరణ జరగాలి. ఇప్పటికే విస్తరించిన రోడ్ల కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలి. అనుమతి లేకుండా రోడ్లను ఇష్టం వచ్చినట్లు తవ్వే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. రోడ్లపై విచ్చలవిడి పార్కింగ్‌లను నిషేధించాలి. ఫుట్‌పాత్‌లు, రోడ్లపైనే అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్న వారిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు



పోతరాజుల నృత్యాల మధ్య అమ్మవారి ఘటం ఊరేగింపు



రంగంలో భవిష్యవాణి వినిపిస్తున్న వైష్ణవి



బోనాల వేడుకల్లో బీఆర్ఎస్ నాయకుడు మాగంటి వజ్రనాథ్ తదితరులు

డబీర్‌పురా: ఫర్హత్‌నగర్‌లోని ఫిలక్‌మాత ఆలయంలో ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలను సమర్పించగా..సోమవారం అమ్మవారి ఘటాన్ని సామూహికంగా ఊరేగింపు నిర్వహించారు. పోతరాజు నృత్యాలు.. డప్పు చప్పుళ్లు..యువకుల నృత్యాలు, తొట్టెల, పలహారపు బండి ఊరే గింపులను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రూప మహేందర్, ఇ.నారాయణ, ఎం.నరసింహా, జి.నరేందర్, ఇ.మహేందర్, ఎ.రమేశ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులను చల్లగా చూసుకుంటా..

బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఫిలక్‌మాత ఆలయం వద్ద వైష్ణవి రంగంలో భవిష్యవాణిని వినిపించింది. భక్తులను చల్లగా చూసుకుంటానని భక్తులు తనకు భక్తితో బోనాలు సమర్పించాలన్నారు. వర్షాలు సమృద్ధిగా పడుతాయని భవిష్యవాణిలో రంగం వినిపించారు.

షేక్‌పేట్ టూంబ్స్ చౌరస్తా వద్ద..

గోల్కొండ: షేక్‌పేట్ టూంబ్స్ చౌరస్తా వద్ద గల నల్ల పోచమ్మ అమ్మవారి బోనాల వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. సోమవారం పలహార బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ పలహార బండ్ల ఊరేగింపులో జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు మాగంటి వజ్రనాథ్, పూస వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడతాం



లక్ష్మీభవానిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీధర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: యువతకు సముచిత ప్రాధాన్యతను కల్పిస్తూ, యువత సమస్యలపై నిరంతరం పోరాడుతామని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ అన్నారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని పార్టీ కార్యాలయంలో సామాజిక సేవకురాలు లక్ష్మీవాణి భవాని తన అనుచరులతో కలిసి ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యువతకు పార్టీలో పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. లక్ష్మీభవానిని జాతీయ కార్యదర్శిగా నియమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సింగం శ్రీనివాసరావు, మీడియా సలహాదారులు ఎస్వీ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గురు వినయ్‌జీకి సత్కారం



గురు వినయ్‌జీని సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: వృత్తి నిపుణులు ఆధ్యాత్మికతత కోసం రోజు కొంత సమయం కేటాయిస్తే ఎంతో జ్ఞానోదయం లభిస్తుందని విజ్డమ్ ఫౌండేషన్ తత్వవేత్త గురు వినయ్‌జీ తెలిపారు. సోమవారం అబిడ్స్ తాజ్‌మహల్ హోటల్‌లో ఆధ్యాత్మిక-పరివర్తన అనే అంశంపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ స్పీకర్ మీట్‌ను నిర్వహించారు. ఈ మీట్‌కు గురు వినయ్‌జీ ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడుతూ..అనవసరమైన వాటిని త్యజించడం అనే భావన మనలో కలిగించుకోవాలని వ్యక్తిగత, వృత్తిపరమైన సవాళ్లతో అనవసరంగా ఒత్తిడికి గురికావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు సీఏ చంద్రశేఖర్ వేముల, కార్యదర్శి ఆశీష్ జోషి, రామ్‌దేవ్, అమృత్‌కుమార్, జెవి.రావు, సురేష్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సంతాప దినాలు



రాందేవ్‌గూడలో షియా ముస్లింల ఊరేగింపు

గోల్కొండ: మొహర్రం సంతాప దినాలు కొనసాగుతున్నాయి. అహ్మద్‌నగర్, ఆసిఫ్‌నగర్, టోలిచౌకీ, గోల్కొండ, తదితర ప్రాంతాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు అలంలను ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు అలంలకు దట్టీలు సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. ఇదిలా ఉండగా రింగ్ రోడ్డు, మెహిదీపట్నం, రాందేవ్‌గూడ రోడ్డు తదితర ప్రాంతాలోని ఆషూర్‌ఖానాల వద్ద షియా ముస్లింలు నల్లటి బట్టలు ధరించి సంతాప గీతాలు ఆలాపించారు. రాందేవ్‌గూడ ఆషూర్‌ఖానాలో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన షియా ముస్లింలు మజాలిస్ కార్యక్రమం నిర్వహించి అలంలకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ ఊరేగింపుకు టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

దోస్త్ స్పెషల్ ఫేజ్ అడ్మిషన్లు ప్రారంభం


అబిడ్స్: నాంపల్లి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి దోస్త్ స్పెషల్ ఫేజ్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియేట్ పూర్తిచేసిన విద్యార్థినులు అందరూ ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. బీఏ, బికాం, (సీ.ఏ) బీబీఏ, బీఎస్సీ (ఫిజికల్ సైన్సెస్), బీఎస్సీ (లైఫ్‌సైన్సెస్), కంప్యూటర్ సైన్సెస్ వివిధ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకునేవారు ఫోన్‌నెంబర్లు 70329 60368, 98668 92692, 80193 21770లకు ఫోన్‌చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివిధ కోర్సుల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వాళ్లకి ఆగస్టు 3వ తేదీన సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు.

నైట్రావిట్ ట్యాబ్లెట్లు స్వాధీనం.. మహిళ రిమాండ్

నాంపల్లి: నైట్రావిట్ ట్యాబ్లెట్లను విక్రయిస్తున్న ఓ మహిళను హబీబ్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా నైట్రావిట్ ట్యాబ్లెట్లను విక్రయిస్తున్న ఇళ్లపై దాడులు జరిపారు. ఇన్‌స్పెక్టర్ టి.పురుషోత్తమ్ రావు నేతృత్వంతో మాన్గార్‌బస్తీలోని చక్రధారి, తీరిధారి ఇళ్లలో సోదాలు చేశారు. ఈ సోదాల్లో భారీగా నైట్రావిట్ ట్యాబ్లెట్లు దొరికాయి. కీలక సూత్రధారి చక్రధారి పరారయ్యారు. కాగా తీరిధారి భార్య మంజూ పోలీసులకు చిక్కారు. ఆమె నుంచి 2వేల ట్యాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు ఎన్‌డీపీఎస్ యాక్టు కింద కేసు నమోదు చేశారు. పోలీసులకు చిక్కిన మంజూను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

అబిడ్స్: రిజిస్ట్రేషన్ శాఖలో ఉన్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్ హుస్సేనీ కోరారు. ఈ మేరకు సోమవారం రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులకు కేటాయించిన ఎన్నికల విధులను రద్దు చేయాలన్నారు. జూనియర్, సీనియర్ అసిస్టెంట్ పోస్టుల పదోన్నతులను వెంటనే కల్పించాలన్నారు. సస్పెండ్ చేసిన ఉద్యోగులను తిరిగి తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ హన్మంతు సానుకూలంగా స్పందించారు. అంచెలంచెలుగా ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకట్, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న జగదీశ్వర్, ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీ

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జోనల్ కమిషనర్ వెంకన్న

చార్మినార్: ప్రజావాణిలో తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న తెలిపారు. జోనల్ కమిషనర్ వెంకన్న పర్యవేక్షణలో చాంద్రాయణగుట్ట సర్కిల్ పూల్‌బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట, సర్కిళ్లకు సంబంధించిన రోడ్ల సమస్యలపై 2 ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ..ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణిని బస్తీ, కాలనీవాసులు సద్వినియోగం చేసు కోవాలన్నారు . ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ విష్ణువర్ధన్, ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్ ఈ ఈ రామారావు పాల్గొన్నారు.

షేక్‌పేట్ ఇండోర్ స్టేడియం అభివృద్ధికి నిధులు



జూనియర్ బాక్సింగ్ విజేతలతో షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ ఫరాజుద్దీన్

గోల్కొండ: షేక్‌పేట్ ఇండోర్ అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషేద్ ఫరాజుద్దీన్ అన్నారు. షేక్‌పేట్‌లో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాక్సింగ్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన వివిధ విభాగాల్లో గెలుపొందిన వారికి మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..షేక్‌పేట్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాక్సింగ్ పోటీలు విజయవంతంగా నిర్వహించిన హైదరాబాద్ బాక్సింగ్ ఫెడరేషన్ వారిని ఆయన అభినందించారు. కాగా ఇక్కడ జరిగిన వివిధ విభాగాల్లో మొదటిస్థానం సంపాదించిన వారు ఆగస్టు 6 నుంచి నోయిడాలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని బాక్సింగ్ ఫెడరేషన్ కార్యదర్శి రవీందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బాక్సింగ్ కార్యదర్శి వినేష్‌బాబు, కోచ్‌లు శివకుమార్, సన్నీ, శశాంక్, వంశీకృష్ణ తదితరులున్నారు.

రంగస్థల ప్రముఖులకు నివాళి



ప్రముఖులకు నివాళులర్పిస్తున్న ఆచార్య కోట్ల హనుమంతరావు

నాంపల్లి: తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో సోమవారం రంగస్థల కళల శాఖ ఆధ్వర్యంలో రంగస్థల కళల శాఖ పూర్వ శాఖాధిపతులు జె.వి.సోమయాజులు, డి.ఎస్.ఎన్.శర్మ, దేవదాసు కనకాల, పూర్వ అధ్యాపకులు జె.వి.రమణమూర్తి, డి.శ్రీనివాస దీక్షిత్ జయంతులను పురస్కరించుకుని స్మారక ప్రసంగాల సభను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు హాజరై రంగస్థల ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పించి ప్రసంగించారు. రంగస్థల కళల శాఖ పురోభివృద్ధికి, విద్యార్థులను తీర్చిదిద్దడానికి వారు చేసిన కృషిని, వారితో తనకున్న అనుబంధాలను ఆయన గుర్తు చేసుకున్నారు. రంగస్థల కళల శాఖ శాఖాధిపతి డాక్టర్ బి.హెచ్.పద్మప్రియ మాట్లాడుతూ..ఆయా అధ్యాపకుల ఆధ్వర్యంలో నాటకాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రంగస్థల కళల శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజు, శ్రీధర్ దీక్షిత్, సుజాత దీక్షిత్, వి.ధనరాజ్, శోభన్, శివ ప్రసాద్, నేహాల్, సాయి, శ్రీకర్ పాల్గొన్నారు.

జీఎస్ఎన్ శాస్త్రి మృతి నాటక రంగానికి తీరని లోటు



జీఎస్ఎన్ శాస్త్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళా సంస్థల ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: రంగస్థల ప్రయోక్త నాటక, నాటక దర్శకుడు గరికపాటి సుబ్బ నర్సింహ శాస్త్రి మృతి నాటక రంగానికి తీరని లోటు అని పలువురు వక్తలు అన్నారు. సోమవారం రవీంద్ర భారతిలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, యువ కళావాహిణి, కళా విపంచి, శ్రీ కళా నికేతన్ సంస్థల ఆధ్వర్యంలో గరికపాటి సుబ్బ నర్సింహ శాస్త్రి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జీఎస్ఎన్ శాస్త్రితో ఉన్న జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వంశీ సంస్థల వ్యవస్థాపకులు వంశీ రామరాజు, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి మద్దాలి రఘురామ్, యువ కళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ, శ్రీ కళానికేతన్ అధ్యక్షులు సాధు శ్యామ్‌ప్రసాద్, కళావిపంచి అధ్యక్షులు నర్సింహారావు, నిర్వాహకులు శివశంకర శాస్త్రి పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, అధికారులు

యాకుత్‌పురా: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్‌తో కలిసి సోమవారం జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజినీర్ భాస్కర్‌రెడ్డి, చీఫ్ ఇంజినీర్ రత్నకర్, చార్మినార్ జోన్ ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి యాకుత్‌పురాలోని పలు లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. యక్రబ్‌నగర్, మదీనానగర్, లండన్ బ్రిడ్జి నాలా పరిసర బస్తీల్లో వరద నీటి సమస్యలపై స్థానికులతో ఆరా తీశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లండన్ బ్రిడ్జి నుంచి వరద నీరు స్థానిక బస్తీలను ముంచెత్తడంపై స్థానికులు అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నెలకొన్న వరద నీటి సమస్యపై జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను కలిసి వివరించామన్నారు. తక్షణమే స్పందించిన కమిషనర్ ప్రాజెక్ట్స్, ఇంజినీరింగ్ విభాగాల ఉన్నతాధికారల బృందాన్ని పరిశీలనకు పంపించారని తెలిపారు. యాకుత్‌పురా నాలా పరీవాహక ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు వరద నీటి సమస్య పరిష్కారానికి లండన్ బ్రిడ్జి వద్ద నూతన బ్రిడ్జి నిర్మించాలని సూచించారన్నారు. వెంటనే కమిషనర్‌తో చర్చించి నూతన బ్రిడ్జి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. రెయిన్ బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, జీహెచ్ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ ఈఈ సువర్ణ, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

దృష్టి మరల్చి చోరీలు చేస్తున్న ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: దృష్టి మరల్చి చోరీల పాల్పడుతున్న ముఠాను టోలిచౌకీ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం టోలిచౌకీ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ వివరాలు వెల్లడించారు. పి.సాయిప్రసాద్‌రెడ్డి తనను కొందరు మోసపూరితంగా దోచుకున్నారని ఈ నెల 25న టోలిచౌకీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెడ్ హిట్ యాప్ ద్వారా అతడికి మాజ్ అనే వ్యక్తితో ఫోన్‌లో పరిచయం అయ్యాడు. తన స్నేహితుడైన సయ్యద్ ఇర్ఫాన్ వద్ద రూ.10 లక్షల విలువ చేసే యూఎస్‌డీటీ ఉన్నాయని నమ్మబలికాడు. వీటిని తక్కువ ధరకు అమ్మడానికి ఇర్ఫాన్ సిద్ధంగా ఉన్నాడని బుకాయించాడు. ఈ నెల 24న సాయి ప్రసాద్‌రెడ్డి రూ.6.40 లక్షలు తీసుకొని మాజ్‌ను కలిశాడు. మాజ్ బాధితుడిని పారమౌంట్ కాలనీలోని ఎయిర్ లింక్ అనే ఆఫీసుకు తీసుకువెళ్లాడు. అక్కడ అప్పటికే నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు ఉన్నారు. అందులో నుంచి ఒక వ్యక్తి రూ.6.40 లక్షలు తీసుకొని లెక్కించి అక్కడున్న ముగ్గురికి ఇచ్చాడు. వారు డబ్బు తీసుకొని కొద్ది సేపు వేచి చూడాలని మీ ట్రేడింగ్ అకౌంట్‌లోకి నేరుగా యూఎస్‌డీటీ చేరుతుందని వారు బుకాయించారు. ఎంతసేపటికీ డబ్బు రాలేదు. కార్యాలయంలోని ఇద్దరు వ్యక్తులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. అక్కడ ఉన్న మరో ఇద్దరు డబ్బు సంచిని తీసుకొని ఉడాయించారు. కాగా బాధితుడికి తన లాగే మరో వ్యక్తి సయ్యద్ నిజాముద్దీన్ కూడా రూ.5.30 లక్షలు మోసం చేసినట్లు తెలిసింది. విచారణ చేపట్టిన పోలీసులు సోమవారం జూపార్క్ ప్రాంతానికి చెందిన మహ్మద్ బిలాల్, హకీంపేట్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ ఆజామ్, శంషాబాద్‌కు చెందిన మహ్మద్ ఇక్బాల్, పారమౌంట్ కాలనీకి చెందిన మహ్మద్ జమీల్ అహ్మద్, ఎండీలైన్స్‌కు చెందిన సయ్యద్ మాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.7.55 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. సయ్యద్ ఖలీల్ అహ్మద్, అబ్దుల్ షాహెద్, మహ్మద్ అఖీల్ అహ్మద్, సయ్యద్ ఇర్ఫాన్ అనే నలుగురు పరారీలో ఉన్నారని ఏసీపీ సయ్యద్ ఫయాజ్ తెలిపారు.